క్లుప్తంగా

ఫాంహౌస్‌కు నోటీసులు


నోటీసు అతికించిన కార్యదర్శి

మునిపల్లి(అందోల్): పొల్కంపల్లి గ్రామ శివారులోని బీఆర్‌ఎస్ నేత సాయికుమార్ ఫాంహౌస్‌కు శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు అతికించారు. పది సంవత్సరాలుగా గ్రామ పంచాయతీకి ఎలాంటి పనులు చెల్లించలేదన్నారు. మూడు రోజులోగా వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. వివరణ ఇవ్వని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని సాకి చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, కార్పొరేటర్, సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ మాట్లాడుతూ.. నిమజ్జన వేడుకలలో భారీగా భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, దారి పొడవునా లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెద్ద విగ్రహాల కోసం భారీ క్రేన్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గుంతల రోడ్డుతో అవస్థలు


గుంతల్లో నాట్లు వేస్తున్న బీజేపీ నాయకులు

వట్‌పల్లి(అందోల్): అల్లాదుర్గ్ ఐబీ నుంచి వట్‌పల్లి మీదుగా మెటల్‌కుంటా వెళ్లే గుంతల రోడ్డుపై శనివారం వట్‌పల్లి సమీపంలో బీజేపీ నాయకులు నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా గుంతలు పడిన రోడ్డుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ పార్టీ కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా రోడ్డును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ సురేష్‌గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అరవింద్ పాల్గొన్నారు.

ముగిసిన తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో తండావాసులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం అకలాయి తండాలో 11 రోజులుగా నిర్వహించిన తీజ్ వేడుకలు శనివారం ముగిశాయి. వేడుకల్లో భాగంగా తండాకు చెందిన అవివాహిత యువతులు మొదటి రోజున 11 రకాల విత్తనాలను ఒకే బుట్టలో వేసి ప్రతీ రోజు వాటి చుట్టూ భక్తిపాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలు చేస్తూ పూజలు చేశారు. చివరి రోజున మొలకెత్తిన విత్తనాల బుట్టలను యువతులు తలలపై పెట్టుకుని భవానీమాత, సేవాలాల్ ఆలయాల నుంచి ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేసి గంగమ్మ ఒడికి పంపారు. టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు సమాయత్తం చేయండి

ఎంఈఓ ఎండీ రహీమొద్దిన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా సమాయత్తం చేయాలని ఎంఈఓ ఎండీ రహీమొద్దిన్ సూచించారు. శనివారం అన్నీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 3న పోటీలకు బాలురు, బాలికలకు జూనియర్, సీనియర్ స్థాయిల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

పక్కాగా సాగు వివరాలు నమోదు

- క్షేత్రస్థాయిలో ఏఈఓల పరిశీలన
- డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా నమోదు
- 116క్లస్టర్లలో చేపట్టిన వివరాల సేకరణ


మేడపల్లి గ్రామంలో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈఓ రేణుక

సంగారెడ్డి జోన్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో వ్యవసాయ అధికారులు పంట సర్వేను చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 25 వరకు సర్వే ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

క్లస్టర్ పరిధిలో రెండు గ్రామాలు

ఈ డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా ప్రతి క్లస్టర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టగా రెండు గ్రామాలను సర్వే చేస్తారు. గతేడాది యాసంగి సీజన్‌లో మొదటిసారిగా ఈ సర్వేను ప్రవేశపెట్టింది. అప్పట్లో ప్రతి క్లస్టర్ పరిధిలో ఒక గ్రామాన్ని ఎంచుకుని సర్వే చేసిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 116 క్లస్టర్ల పరిధిలో 116 మంది ఏఈఓ లో సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7,20,000 సాగు విస్తీర్ణం ఉండగా డిజిటల్ క్రాప్ సర్వేలో 2 లక్షల 25 వేల ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేయనున్నారు. మహిళ ఏఈఓ లకు 1,800 ఎకరాలు, పురుషులకు 20 ఎకరాలు నిర్ణయించారు. వానాకాలం సీజన్‌లో భాగంగా పత్తి, చెరుకు, వరితోపాటు పప్పు దినుసులు పెసర, మినుము, మొక్కజొన్న, కంది సోయాబీన్ తదితర పంటలు సాగులో ఉన్నాయి.

సాగు వివరాలు:	
జిల్లా వ్యాప్తంగా ఉన్న సాగు భూమి	7,20,000
డిజిటల్ క్రాప్ సర్వే చేయనున్న సాగుభూమి	2,25,000
జిల్లాలో ఉన్న క్లస్టర్లు	116
ఏఈఓలు	116

సర్వే నంబర్‌కు వెళ్లాల్సిందే

డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా తప్పనిసరిగా సంబంధిత సర్వే నంబర్‌లోకి వెళ్లి నమోదు చేసే విధంగా యాప్ ను రూపకల్పన చేశారు. సంబంధిత రైతు కలిగి ఉన్న భూమి ఎంత? ఏ పంటలు సాగు చేస్తున్నారు? సాగుకు వినియోగిస్తున్న నీటి వనరులతోపాటు సంబంధిత రైతు పంట ఫొటో తదితర వివరాలతో అక్కడే నమోదు చేస్తున్నారు. సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా ఉండేందుకు రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిజిటల్ క్రాప్ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. పంట దిగుబడి అంచనా, ధాన్యం పక్కదారి పట్టకుండా, దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు ఈ సర్వే దోహదపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సర్వేతో రైతులకు ప్రయోజనం



వానాకాలం సీజన్‌లో భాగంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసేందుకు డిజిటల్ క్రాప్ సర్వేను చేపట్టడం జరిగింది. అధికారులు తప్పనిసరిగా పంట పొలం వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో సర్వే కొనసాగుతుంది.

–శివ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి

వట్‌పల్లిలో 1156 ఎకరాల్లో పంట నష్టం


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి


ఇసుకతో నిండిన వరి పంట

వట్‌పల్లి(అందోల్): ఎడతెరపి లేని వర్షాలకు మండల పరిధి బిజిలీపూర్, గొర్రెకల్, వట్‌పల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులకు ఏ మేరకు నష్టం జరిగిందనే వివరాలు సేకరించారు. మండలంలో పత్తి 960 ఎకరాలు, పెసర 122 ఎకరాలు, వరి 7 ఎకరాలు, మినుము 57 ఎకరాలు, సోయబీన్ 10 ఎకరాలు మొత్తంగా 1156 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచవేశామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఏఈఓలు మహేశ్, కల్యాణ్, ప్రవీణ్ ఉన్నారు.

పంట నష్టంపై వివరాల సేకరణ

కల్హేర్(నారాయణఖేడ్): భారీ వర్షాలకు మండలంలో పంట నష్టంపై వ్యవసాయ అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. మాసాన్‌పల్లి, దేవునిపల్లిలో వరి పొలాల్లో ఇసుక మేటలు నిండిపోయాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏఓ వెంకటేశం, ఎఈఓ సంతోష పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు సేకరించారు.

మహనీయుల చరిత్రను తెలియజేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సింధూరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చిన్నారులకు చిన్ననాటి నుంచే మహనీయుల చరిత్రను తెలియజేయాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూరెడ్డి సూచించారు. భెల్ కాలనీలోని జ్యోతి విద్యాలయ పాఠశాలలో భారతీ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నేషనల్ గ్రూప్ సాంగ్ పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీ వికాస్ ఆధ్వర్యంలో సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తుండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో భారతీ వికాస్ ప్రతినిధి సతీశ్‌గౌడ్, వ్యాపారవేత్త అరవ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ జోష్యం చెప్పారు. శుక్రవారం మండలంలోని పొలకంపల్లి గ్రామ శివారులోని మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ముందు అడ్డగోలు మాటలతో, సాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నిల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటి వరకు అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగిందంటే అది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీదేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందోల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మ నియోజక వర్గంలోని గ్రామాలు అభివృద్ధికి అమడదూరంలో ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, రమేశ్, విశ్వనాథం, శివశంకర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, శ్రీనివాస్, శంకర్, విఠల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బోధ వ్యాధిపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: బోధ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మౌనిక, డాక్టర్ శశికర్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని భాగ్య హెల్త్ క్లబ్, జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ సంయుక్తంగా బోధవ్యాధి లింఫాటిక్ ఫైలేరియాసిస్‌పై అవగాహన కల్పించారు.. ముఖ్యఅతిథుగా వక్తలు డాక్టర్ మౌనిక, డాక్టర్ శశికర్ హాజరై బోధ వ్యాధిపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు డీఈసీ గుళికలు అందజేశారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు


రోడ్డుపై టిప్పర్లతో పోస్తున్న మొరం మట్టి

జహీరాబాద్: అల్గోల్ వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నందున యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పనులు చేపట్టారు. శనివారం రహదారిపై కంకర, మొరం వేసే పనులు ప్రారంభించారు. శుక్రవారం రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావులు దెబ్బతిన్న జహీరాబాద్-అల్గోల్ రహదారిని అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జనం కోసం విగ్రహాలను తరలించేటప్పుడు ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తక్షణమే పనులను చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో వెంటనే నిర్మాణం పనులు చేపట్టారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఎస్సై కృష్ణాగౌడ్



అవగాహన కల్పిస్తున్న కృష్ణాగౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): సైబర్ నేరాలపై సమాజంలోని ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఎస్సై కృష్ణాగౌడ్ స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శనివారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం సైబర్ నేరాలు చాలా పెరుగుతున్నాయన్నారు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాల్లో ఎక్కువగా విద్యావంతులే ఎక్కువగగా మోసపోతున్నారని చెప్పారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని వివరించారు. తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు చెప్పాలని కోరితే చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ప్రయోజనం

ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): పేదలకు ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్‌ఎఫ్) వరంలా ఉపయోగపడుతోందని రాయికోడ్ ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు పేర్కొన్నారు. వట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషితో కలసి ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 22 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.10.05లక్షల విలువైన చెక్కులను సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కచూర్‌రావు మాట్లాడుతూ...పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంగారెడ్డి, అశోక్‌గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌పాటిల్, ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్ రావు, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, నాయకులు గోపాల్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయండి


న్యాల్‌కల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్


జహీరాబాద్: పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ శ్రీనివాస్ సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శించిన ఓటరు జాబితాల్లో ఏమైనా పొరపాట్లు, మార్పులు ఉంటే చెప్పాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మృతి చెందిన వారి పేర్లు ఓటరు జాబితాల్లో ఉన్నాయని, వాటిని తొలగించాలని పలువురు నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు కార్యాలయంలో..

నారాయణఖేడ్: స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా, సక్రమంగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలని ఖేడ్ ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాతో పాటు నిర్వహణకు అవసరమై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. నిజాంపేట్ మండల కేంద్రంలో నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం ఆయా పార్టీల నాయకులతో స్థానిక ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.

అఖిల పక్ష సమావేశం

మునిపల్లి(అందోల్): స్థానిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ లిస్టు, పోలింగ్ బుత్, ఏర్పాట్లపై ఎంపీడీఓ హరినందన్‌రావు ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టులో ఏవైనా తప్పులుంటే సరి చేసుకోవాలని కోరారు. ఒక కుటుంబం ఓట్లు ఒకే వార్డులో ఉండేలా, ఇండ్లు వరుస క్రమంలో వార్డులను తయారు చేయాలన్నారు. డబుల్ ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్ సౌకర్యం ఉండేలా చేయాలన్నారు. వికలాంగులకు విల్ చైర్లు ఏర్పాట్లు చేయాలన్నారు.

పంచాయతీ ఎన్నికల సమావేశం

జహీరాబాద్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శనివారం ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి వారితో సమావేశమై మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పురస్కరించుకుని ఈనెల 28న అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఉంచామని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా ప్రధాన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కల్హేర్, సిర్గాపూర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓలు రమేష్‌బాబు, శారదబాయి ఓటరు జాబితాల మార్పులు, చేర్పులపై చర్చించారు.

పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తులో భాగంగా శనివారం మండల స్థాయిలో ఎంపీడీఓ లక్ష్మి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శికి తెలపాలన్నారు.

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించిన ఓటరు లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఒకే కుటుంబంలోని వారు వేర్వేరు వార్డుల్లో ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే మార్పుకు అవకాశం ఉంటుందన్నారు.

నాయకులు సహకరించాలి

కంది(సంగారెడ్డి): పంచాయతీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇటీవల ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డిని శనివారం కాంగ్రెస్ శ్రేణులు కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సన్మానించి, సీఎం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐలాపురం నాగరాజు, రవీందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, భుజంగారెడ్డి, లక్ష్మీహరి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నారాయణఖేడ్: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కళాశాల వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు గత ఏడు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించి ఆరోగ్య, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

◆ నేడు విద్యుత్ సరఫరా బంద్

నారాయణఖేడ్: డివిజన్ పరిధి నిజాంపేట మండలం ర్యాలమడుగు 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉ.8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగిరెడ్డి, ఏఈ శృతి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ సీడ్ బాల్స్‌పై అవగాహన

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధి కొడకంచి గ్రామంలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రేమవతి తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌సుందర్, గజేంద్ర విద్యార్థులతో కలిసి 300 సీడ్ బాల్స్ విత్తనాలను స్థానిక అమ్మచెరువు కట్టపై నాటారు.

◆ ఇంటింటికీ మొక్కలు పంపిణీ


మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కమిషనర్

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలో వందరోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గడ్డపోతారం, వావిలాల గ్రామాల మధ్య ఎల్లమ్మగుడి వద్ద ధ్వంసమైన రోడ్డుకు కమిషనర్ వెంకటరామయ్య మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వినాయకుడికి కుంకుమార్చన


కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

జహీరాబాద్: పట్టణంలోని శ్రీసాయినగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి శనివారం మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

అట్రాక్షన్‌గా మట్టి గణపయ్య

నారాయణఖేడ్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మండపంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. పట్టణంలో 40 మండపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. అందులో ఒక్కటే మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

శిల్పారామం తరహాలో..

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీ కృష్ణ నగర్ కాలనీలో వీరభద్ర యూత్ ఆధ్వర్యంలో శిల్పారామం తరహాలో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

జనఔషధిలో తక్కువ ధరకు మాత్రలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


కృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన జన ఔషధి స్టోర్‌లో తక్కువ ధరకే మాత్రలు లభిస్తాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలోని జన ఔషధి స్టోర్ నిర్వాహకుడు కృష్ణ మాత్రలు విక్రయాలుతో పాటు, పేదలకు సర్వీస్ చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది. ఈ నేపథ్యంలో జన ఔషధి స్టోర్ నిర్వాహకుడు కృష్ణను ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎంఓ ప్రవీణ, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సన్మానించారు.

బాబానగర్‌కు నిలిచిన రాకపోకలు

కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు


కాల్వను తవ్వుతున్న జేసీబీ

జహీరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలోని రంజోల్ గ్రామ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో మూడు రోజులుగా బ్రిడ్జి నుంచి బాబానగర్ గ్రామానికి, వ్యవసాయ పొలాలకు రాకపోకలను పూర్తిగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా...నీటిపారుల శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు శాఖల అధికారుల సహకారంతో శనివారం రాకపోకలను పునరుద్ధరించే పనులు చేపట్టారు. బాబానగర్‌కు గతం నుంచి ఉన్న కెనాల్‌ను జేసీబీ సహాయంతో తవ్వించారు.